7

సాక్షి మహబూబ్‌నగర్

మహిళా దినోత్సవం

శనివారం । 8 । మార్చి । 2025



వివక్ష లేదు.. వేధింపులు తగ్గలేదు


● సాక్షి సర్వేలో మహిళల మనోగతం

ఇంట్లో వివక్ష లేకున్నా... బహిరంగ ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు కొంతమేర కొనసాగుతున్నాయి. బస్టాప్, కళాశాల, ఆఫీస్‌తో పాటు అసభ్యపద జాలంతో పంపిస్తున్న మెసేజ్‌లతో ఇబ్బంది పడుతున్నారు. తెలియనివారితోనే ఎక్కువ సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు మహిళలు చెబుతున్నారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో ఆడ–మగ వివక్ష, పని ప్రదేశంలో వివక్ష తదితర అంశాలపై ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా సాక్షి సర్వే నిర్వహించగా పలు విషయాలు వెలుగు చూశాయి. - సాక్షి నెట్‌వర్క్

సర్వే చేసిన ప్రాంతాలు : మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాలో 50 చొప్పున మొత్తం 250 శాంపిల్స్ సేకరణ

అభిప్రాయాల సేకరణ: డిగ్రీ, పీజీ, మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థినులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల మహిళా ఉద్యోగులు


1) మీ ఇంట్లో ఆడ -మగ వివక్ష ఏమైనా ఉందా..?



2) మీ కాలేజీ - పని ప్రదేశంలో మహిళగా ఏమైనా వివక్ష ఎదుర్కొంటున్నారా..?



ఉంది | లేదు | చెప్పలేను



3) మీరు ఎక్కువగా ఇబ్బంది పడుతున్న ప్రదేశం

బస్టాప్‌లో | కాలేజీ లేదా ఆఫీసులో | సెల్‌ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లతో

4) మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న వారిలో అత్యధికులు ఎవరు?



తెలియని వారు | తెలిసిన వారే

మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి



మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి జరుగుతుంది. మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలి. సమాజంలో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పించాలి. మూఢ నమ్మకాల నుంచి బయటకు రావాలి. మారుతున్న కాలంతో పాటు మహిళల ఆలోచనలో కూడా మార్పు రావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మహిళలపై వివక్ష సమాజంలో కొంతమేర ఉంది.. ఇది పూర్తిగా పోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం కూడా మహిళల కోసం మహిళా శక్తి క్యాంటీన్‌ను మంజూరు చేసింది. దీన్ని విజయవంతంగా నడిపిస్తున్న మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. - విజయేందిర, కలెక్టర్

నిను చులకనగా చూస్తున్న సమాజానికి చుక్కానిలా నిలిచావు. అవమానాలెన్ని ఎదురైనా అన్నింటా మేటిగా రాణించావు. కలుపుతీసి.. కోత కోసి బంగారం పండించావు. ఆకాశమంతా నేనేనంటూ గగనతలంలో విహరించావు. మోటారు వాహనాలను నడుపుతూ ముందుకు దూసుకుపోతున్నావు. ఆత్మీయత పంచి.. అనురాగం పెంచి సమాజ గమనాన్ని నిర్దేశించావు. ఆడపిల్లవు.. నీకెందుకులే అన్న సమాజాన్ని ముందడుగు వేయించావు. చదువు, ఆట పాటలే కాదు.. తుపాకీ భుజానికెత్తుకొని కాపలాకాసి దేశానికి భద్రతనిచ్చావు. అల్లరిమూకల ఆగడాలు 'నిర్భయ'ంగా ఎదుర్కొంటూ జీవన సమరంలో దూసుకు పోతున్నావు. ఎన్ని అవరోధాలు వచ్చినా తట్టుకొని జీవిస్తూ కుటుంబానికి, దేశానికి వెలుగునిస్తున్న ఓ మహిళా నీకు వందనం.. శనివారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు వనితలపై ప్రత్యేక కథనం..

వనిత.. ప్రగతి బావుటా

- వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్న 'ఆమె'
- ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు కృషి
- ఉమ్మడి జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు మహిళలు

భరోసా హెల్ప్‌లైన్ **87126 59280**

షీటీం హెల్ప్‌లైన్ **87126 59365**

అతివకు అందలం

- అన్నిరంగాల్లో రాణించాలంటే చదువు ఎంతో ముఖ్యం
- ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారతపై 'సాక్షి' డిబేట్

- వివరాలు 8లో..

శెభాష్.. నారాయణమ్మ

పాడి పరిశ్రమతో రాణింపు ● మరో ఆరుగురికి ఉపాధి కల్పిస్తూ ముందుకు..



గేదెలకు నీళ్లు తాపుతున్న కాకర్ల నారాయణమ్మ (ఫైల్)

నారాయణపేట: జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే తపన.. కేవలం వంటింటికే పరిమితం కాకూడదన్న తలంపు.. తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవాలనే ఆశయం ముందు కష్టాలు, అలసట పటాపంచలు అయ్యాయి. ఫలితంగా తనతో పాటు మరో ఆరుగురికి ఉపాధి కల్పిస్తూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. నారాయణపేటకు చెందిన కాకర్ల నారాయణమ్మ. పట్టణంలోని సింగార్‌బేస్‌కు చెందిన కాకర్ల నారాయణమ్మ 1983లో భర్త కాకర్ల భీమయ్య ప్రోత్సాహంతో రూ.5 వేల పెట్టుబడితో రెండు గేదెలను కొనుగోలు చేసి పాల వ్యాపారానికి శ్రీకారం చుట్టింది. ఇంతింతై.. వటుడింతై అన్న చందంగా ఆ వ్యాపారం ప్రస్తుతం 30 గేదెలతో నెలకు రూ.1.20 లక్షలు ఆదాయం సంపాదిస్తూ.. ఆదర్శంగా నిలిచింది. నిత్యం కష్టజీవిగా పరితపిస్తూ 42 ఏళ్లుగా గేదెలతో చిన్నపాటి కుటీర పరిశ్రమగా మార్చుకుంది. భర్త ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ తానూ సంపాదించాలనే తాపత్రయంతో పాల వ్యాపారంలో రాణిస్తోంది. తనతోపాటు ఆరుగురికి ఉపాధిని కల్పిస్తోంది. గేదెల నుంచి పాల దిగుబడితో రోజుకు రూ.4వేల ఆదాయం ఆర్జిస్తోంది. ఆమె ఉత్తమ పాడి రైతు అవార్డును సైతం అందుకుంది.

రుణం ఇవ్వకపోయినా..

పాడిపరిశ్రమ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ, ఆ ఆర్థిక సహాయానికి కాకర్ల నారాయణమ్మ ఇంత వరకు **నోచుకోలేదు. ఆమె తమ స్వయం** కష్టార్జితంతోనే పాడి పరిశ్రమను అంచెలంచెలుగా అభివృద్ధి పరుచుకుంటూ వచ్చారే తప్ప ఏ బ్యాంకు రుణ సదుపాయం అందిస్తామని ముందుకు రాలేదు. ఎంతో శ్రమిస్తున్న ఈ మహిళకు పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం, బ్యాంకర్లు ఆర్థిక సహాయం అందించి మరింత చేయూతనందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహిళల సమస్యల పరిష్కార వేదికలు

ఫ్యామిలీ కోర్టు, మహిళా న్యాయ స్థానం, రాష్ట్ర మహిళా కమిషన్, మహిళా పోలీస్ స్టేషన్, సఖి కేంద్రం, భరోసా కేంద్రం

కొడుకు పేరిట ట్రస్టు

ప్రతిఏటా నిరుపేద జంటలకు బంగారు పుస్తె, మెట్టెలు అందిస్తూ.. వృద్ధులకు చీరలు ఉచితంగా పంపిణీ చేస్తూ సేవా దృక్పథంతో ముందుకు సాగుతోంది నారాయణమ్మ. ఈమె కుమారుడు కాకర్ల సురేష్ హఠాన్మరణంతో కలత చెందారు. ఆమెకు చేదోడువాదోడుగా ఉంటూ పాడిపరిశ్రమలోఎంతో శ్రమించేవాడు. కొడుకు జ్ఞాపకార్థం సురేష్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి సామాజిక సేవ చేస్తోంది. అలాగే రాజకీయాల్లోకి అడుగుపెట్టి కౌన్సిలర్‌గా ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తోంది. ప్రతిఏటా వేసవిలో జిల్లాకేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తోంది.

వ్యాపారంలో యువ కెరటం

ఆటో మొబైల్ రంగంలో రాణిస్తున్న సిరిచందన



పాలమూరు: ఆటో మొబైల్ రంగంపై ఉన్న ఫ్యాషన్‌తో ఐఎస్‌బీలో మాస్టర్స్ పూర్తి చేసి చిన్న వయసులోనే వ్యాపారరంగంలో రాణిస్తోంది సిరిచందనరెడ్డి గట్టు. మూడేళ్లుగా వ్యాపారంలో దూసుకెళుతున్నారు. తండ్రి గట్టు గోపాల్‌రెడ్డి ఏర్పాటు చేసిన ట్రెండ్ గ్రూప్స్‌లలో హ్యుందాయ్, జాన్‌డీర్, రాయల్ ఎన్‌ఫీల్డ్, మోంట్రా, రెనాల్ట్ వంటి షోరూంలను విజయవంతంగా నడిపిస్తోంది. ఇటీవల తాజాగా హైదరాబాద్‌లో సైతం 'టైటాన్ వరల్డ్' వాచ్ షోరూంను సైతం ప్రారంభించారు. "చిన్నతనంలో అమ్మతో కలిసి షోరూంకు వచ్చేదానిని. ఇక్కడే హోం వర్క్ చేస్తూ కాలక్షేపంతో పాటు ఈ రంగంపై ఇష్టం పెంచుకున్నాను. మొదట్లో నేను ఫ్యాషన్ డిజైనర్ కావాలని అనుకున్న కానీ నాన్న ప్రోత్సాహంతో ఆటో మొబైల్ రంగంలో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని చెప్పాడంతో ఈ రంగం వైపు వచ్చా. మొదట్లో కంపెనీ మీటింగ్‌లకు హాజరైన సమయాల్లో నేను ఒంటరిగా వెళ్లాను. పురుషుల మధ్యలో నా ప్రతిభ చూపాను. మొదట్లో ప్రతి దాంట్లో ఇబ్బంది పడ్డాను. ప్రస్తుతం సంవత్సరంలో దాదాపు రూ.350 కోట్ల టర్నోవర్ చేస్తున్నాను. ఎఫ్‌ఏడీఏ తెలంగాణ వైస్ చైర్మన్‌గా పని చేస్తున్నాను. ఇటీవల నాకు ఉత్తమ జెనిక్స్ అవార్డు సైతం వచ్చింది. అదేవిధంగా జాన్‌డీర్ యూఎస్‌ఏ ఫ్యానల్ సభ్యురాలిగా ఇండియా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ అక్కడే ఒక సెమినార్ కూడా ఇచ్చాను. ఈనెల 8న హైదరాబాద్‌లో యూఎస్‌ఏ జనరల్ కాన్సలైట్ సంస్థ మహిళ దినోత్సవ వేడుకలకు తెలంగాణలో 8 మందిని ఎంపిక చేస్తే అందులో నేను ఒకరిగా ఉండడం ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో వ్యాపార రంగంలో యువ అమ్మాయిలను, మహిళలను ప్రోత్సాహించడానికి ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకున్నాను." అని సిరిచందన పేర్కొన్నారు.

గిరిజన బిడ్డలు.. బాస్కెట్‌బాల్‌లో దిట్టలు

● రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న అక్కాచెల్లెలు



ట్రోఫీలతో అక్కా చెల్లెలు జ్యోతి, ప్రియాంక

మహబూబ్‌నగర్ క్రీడలు: కోయిలకొండ మండలం కేశ్వాపూర్ పెద్దతండాకు చెందిన అక్కా, చెల్లెలు కె.జ్యోతి, కె.ప్రియాంక బాస్కెట్‌బాల్‌లో మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నారు. అక్క జ్యోతి 12 సార్లు జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిత్యం వహించింది. 2015లో పంజాబ్‌లో జరిగిన జూనియర్ నేషనల్, వరంగల్‌లో జరిగిన జాతీయ ఆర్‌జీకేఏ బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొంది. 2016లో కర్ణాటకలో జరిగిన యూత్, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జూనియర్ నేషనల్ టోర్నీలో తెలంగాణ తరఫున ఆడిన జ్యోతి ఆ తర్వాత హైదరాబాద్, లుధియానా, ఢిల్లీ, చెన్నైలో జరిగి పలు జాతీయస్థాయి టోర్నీలో ప్రతిభ చూపారు. అలాగే 25కు పైగా రాష్ట్రస్థాయి టోర్నీల్లో పాలమూరు జట్టు తరఫున బరిలోకి దిగి సత్తా చాటారు. గుజరాత్ రాష్ట్రం భావ్‌నగర్‌లో జరిగిన 36వ జాతీయ క్రీడల్లో పాల్గొని, తెలంగాణ జట్టు స్వర్ణం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. చెల్లి ప్రియాంక 2014లో ఖమ్మంలో తన తొలి రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లాకు ప్రాతినిధ్యం వహించింది. ఇప్పటి వరకు 25కుపైగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంది. అక్క జ్యోతితో కలిసి పలు సార్లు రాష్ట్రస్థాయి టోర్నీలో ఆడింది. మూడు సార్లు జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంది. 2017 ఢిల్లీలో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి టోర్నీలో తొలిసారిగా తెలంగాణ తరఫున బరిలోకి దిగారు. అలాగే 2019 ఢిల్లీలో జరిగిన అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ఆడింది. అండర్–23 విభాగంలో నేషనల్ బాస్కెట్‌బాల్ కోచింగ్ క్యాంపునకు ఎంపికైంది. ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో వీరు హైదరాబాద్‌లోని కేఎల్ యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతున్నారు.

ఆమె పోరాటం.. అందరికీ ఆదర్శం

● జోగిని వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించిన హాజమ్మ

మక్తల్: జోగిని వ్యవస్థ నిర్మూలనకు ఆమె చేసిన పోరాటం ఆదర్శనీయం.. ఒక దృఢ సంకల్పంతో ముందుకు సాగుతూ.. ఏ ఒక్కరినీ జోగినిగా మార్చకుండా అడ్డుకోవడంతో పాటు ఆదర్శ వివాహాలు జరిపిస్తూ.. జోగినుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు ఊట్కూరుకు చెందిన దళిత మహిళ హాజమ్మ. చిన్నతనం నుంచే జోగిని వ్యవస్థను వ్యతిరేకించిన ఆమె.. ఓఎంఐఎఫ్, ఏహెచ్‌టీయూ సంస్థల సహకారంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జోగినులకు అండగా నిలుస్తున్నారు. ఇందుకోసం ఆశ్రయ్ సంస్థ నిర్వాహకురాలు గ్రేస్ నిర్మ**లతో కలిసి 'ఆంధ్ర**ప్రదేశ్ జోగిని వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘటన సంస్థ'ను ఏర్పాటుచేశారు. ఈ సంస్థకు హాజమ్మ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. 20 ఏళ్లుగా జోగిని వ్యవస్థను అడ్డుకుంటున్నారు. ఇప్పటి వరకు 30 మంది జోగినులకు వివాహాలు జరిపించి.. వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 5 వేల మంది జోగినులు ఉన్నారని.. అందులో 2 వేల మందికి ప్రభుత్వం నేటికీ పునరావాసం కల్పించలేదని హాజమ్మ తెలిపారు.

పెళ్లికి అడ్డంకులు..

'మేము ముగ్గురం అక్కాచెల్లెళ్లం. కూలీపని చేసి, జీవనం గడిపేవాళ్లం. నేను ఆరో తరగతిలో ఉన్నప్పుడు (1985లో) జోగినిగా మార్చారు. అప్పుడు మా అమ్మానాన్నకు జోగిని వ్యవస్థ గురించి అసలే తెలియదు. తెలిస్తే అలా చేసేవారు కాదు. 1995లో ఊట్కూర్‌కు చెందిన లక్ష్మయ్యతో పెళ్లి నిశ్చయం కాగా.. చాలామంది గ్రామస్తులు, జోగినిలు వ్యతిరేకించారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను అడ్డుకున్నారు. ఊరోళ్లయితే పంచాయితీ పెట్టి.. జోగినికి పెళ్లి ఎలా చేస్తారని నిలదీశారు' అని హాజమ్మ తన గాథను చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో తాను మూఢనమ్మకాలను పట్టించుకోనని స్పష్టం చేసినట్లు వివరించారు. తాను ఊరందరికీ భార్య అంటున్నారు కదా.. మరి మీ ఆస్తి రాసివ్వాలని అడిగితే ఎవరూ సమాధానం చెప్పలేకపోయారన్నారు. అందరినీ ఎదిరించి పెళ్లి చేసుకున్నానని.. తాను జోగినిని కాదని సమాజానికి తెలియజేసేందుకు చాలా సమయం పట్టిందని పేర్కొన్నారు.



అప్పటి హోంమంత్రి సబిత ఇంద్రారెడ్డి ద్వారా ప్రశంసాపత్రం అందుకుంటున్న హాజమ్మ (ఫైల్)

ప్రభుత్వంతో పోరాడుతున్నా..

ఏ ఒక్కరు జోగినిగా మారకూడదన్నదే నా లక్ష్యం. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మూఢనమ్మకాలను పారద్రోలేందుకు కృషిచేస్తున్నా. బతుకు భారంగా మారిన కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వంతో పోరాడుతున్నా. ఎవరైనా మహిళలకు అన్యాయం చేయాలని చూస్తే సహించను. అందరికీ అందుబాటులో ఉంటూ.. అవసరమైన సేవ చేస్తాను.

- హాజమ్మ, జోగిని వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా

న్యూస్‌రీల్

259 మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 36 పరీక్ష కేంద్రాల్లో 11,303 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 11,044 మంది హాజరయ్యారు. 259 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారులు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేశారు.

18న పీయూలో యువ ఉత్సవ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 18 జిల్లా యువజన సర్వీసుల ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను పీయూ వీసీ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ అధికారి కోటానాయక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ ఉన్న యువతను గుర్తించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని తెలిపారు. పాటలు, ఫొటోగ్రఫీ, వ్యాసరచన, ఆర్ట్, సైన్స్‌మేళా, కల్చరల్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

■ పీయూ పరిధిలోని వనపర్తి పీజీ సెంటర్‌లో 2022లో చేసుకున్న ఒప్పందం మేరకు అక్కడ భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, కంప్యూటర్ ల్యాబ్‌కు సంబంధించిన భవనాలు నిర్మించాలని హైదరాబాద్ జేఎన్టీయూ వీసీ కిషన్‌కుమార్‌ను పీయూ వీసీ శ్రీనివాస్ విన్నవించారు. స్పందించిన ఆయన ల్యాబ్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి



విద్యార్థినులతో జ్యోతి ప్రజ్వలన చేయిస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళలకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించాలని, అప్పుడు వారు అభివృద్ధి చెందుతారని కలెక్టర్ విజయేందిర పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో పని చేస్తూ ముందుకు వెళుతున్నారని అన్నారు. ఇంట్లో, పని చేసే స్థలంలో వివక్ష తొలగిపోవాలన్నారు. 30 ఏళ్ల దాటిన ప్రతి మహిళ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ప్రతి ఏడాది క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం మహిళా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయగా.. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారిని జరీనా బేగం, భూగర్భ జల వనరుల శాఖ డీడీ రమాదేవి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిరా, వైద్య ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారిణి మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి: ఎస్పీ



ఎస్పీ జానకికి బీపీ పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

మహబూబ్‌నగర్ క్రైం: మహిళా పోలీస్ ఉద్యోగుల ఇబ్బందులను అర్థం చేసుకుని, వారి కోసం మరిన్ని మెరుగైన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎస్పీ డి.జానకి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పరేడ్ మైదానంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ సిబ్బంది కోసం ఎస్‌వీఎస్ ఆస్పత్రి సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని, ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సేవలు అందిస్తారని తెలిపారు. ఉద్యోగ బాధ్యతల మధ్య మహిళ ఉద్యోగులు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను గుర్తించి వీటిని సమర్థవంతంగా ఎదుర్కొవడానికి పోలీస్‌శాఖ సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్‌ఐలు సుజాత, వసంత, శ్వేత, ఇందిర పాల్గొన్నారు.



తెలంగాణ మహిళా సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో గత ఏడాది ఉగాది పురస్కారాల ప్రదానం (ఫైల్)

మహిళలు నడిపే ఏకైక సాహిత్య సంస్థ

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థను 2020 ఫిబ్రవరి 7వ తేదీన మహబూబ్‌నగర్‌కు చెందిన పలువురు మహిళా రచయిత్రులు కలిసి ఏర్పాటు చేశారు. మహిళలు నడుపుతున్న ఏకైక సాహిత్య సంస్థ ఇదే కావడం విశేషం. ఈ సంస్థ ద్వారా యువ మహిళ రచయిత్రులు, కవయిత్రులను ప్రోత్సహిస్తున్నారు. సంస్థకు అధ్యక్ష, కార్యదర్శులుగా రావూరి వనజ, జి.శాంతారెడ్డి వ్యవహరిస్తున్నారు. సంస్థ ఆధ్వర్యంలో పలు పుస్తకావిష్కరణ, కవి సమ్మేళనాలు నిర్వహించారు. ప్రతి ఏడాది మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలు చేస్తున్న మహిళలకు స్త్రీ స్ఫూర్తి పురస్కారాలతో సత్కరిస్తున్నారు. విద్యార్థులకు పద్యంపై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా పద్య కార్యశాల నిర్వహించారు. జిల్లాకు చెందిన సాహితీ దిగ్గజం డాక్టర్ పాకాల యశోదారెడ్డి జయంతి వేడుకలతో పాటు తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించి పలువురు రచయిత్రులకు పురస్కారాలు అందజేస్తున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 13 పుస్తకాలను ఆవిష్కరించారు. 2023లో హైదరాబాద్‌లో పద్మాకర్ అవధానిచే శతవధానం నిర్వహించారు. ప్రముఖ రచయిత్రి చుక్కాయపల్లి శ్రీదేవిచే శతావధానం, పలుసార్లు అష్టావధానాలు నిర్వహించారు. గత ఏడాది సంస్థ తరఫున ప్రముఖ పద్యకవులు సందాపురం బుచ్చయ్య, గన్నోజు శ్రీనివాసాచారి, అల్వాల లక్ష్మణమూర్తి, శాస్త్రీయ సంగీత గాయకురాలు సాయి మనస్వినిలకు ఉగాది పురస్కారాలు అందజేశారు. కాళోజీ సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి డాక్టర్ రామరావు సూర్య ప్రకాశ్‌రావు, పాకాల యశోదారెడ్డి సాహితీ పురస్కారాన్ని కవయిత్రి కె.వీణారెడ్డికి అందజేసి సన్మానం చేశారు.

మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాం

ఐదేళ్ల నుంచి సంస్థ ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు నిర్వహిస్తున్నాం. సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలకు ప్రతి ఏడాది అందజేసే స్త్రీ స్ఫూర్తి పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కతిక సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సాహితీ కార్యక్రమాలు చేపడుతాం. నూతన రచయిత్రులు, కవిత్వంపై ఆసక్తిగల విద్యార్థులను ప్రోత్సహిస్తాం.

- సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, జి.శాంతారెడ్డి

సొరంగంలో గడ్డు పరిస్థితులు

- కార్మికుల జాడ కనుగొనేందుకు రంగంలోకి కడావర్ డాగ్స్, రోబోటిక్ బృందం
- 14 రోజులైనా లభించని ఆచూకీ
- కొనసాగుతున్న సహాయక చర్యలు


సొరంగంలోకి వెళ్తున్న కడావర్ డాగ్స్

అచ్చంపేట/అచ్చంపేట రూరల్/బల్మూర్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల జాడ కనుగొనేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సహాయక చర్యలకు నీటి ఊట అడ్డంకిగా మారింది. సొరంగంలో 14 రోజులుగా 12 విపత్తు బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నా కార్మికుల ఆచూకీ మాత్రం లభించడం లేదు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ నిరంతరం పర్యవేక్షిస్తూ కావాల్సిన సహాయక చర్యలు, వనరులు సమకూరుస్తున్నారు. గురువారం కేరళలోని త్రిసూల్ నుంచి వచ్చిన కడావర్ డాగ్స్ శుక్రవారం సొరంగంలోని ప్రమాద స్థలంలో సహాయక బృందాల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టాయి. రోబోటిక్ నిపుణులు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు టన్నెల్ లోపల పరిసరాలు పరిశీలించారు. అన్వి రోబోటిక్, హైదరాబాద్ బృందం ఎప్పటికప్పుడు మొబైల్ ద్వారా సమాచారం తెలుసుకొని అవసరమైన సహకారం అందిస్తున్నారు. సొరంగంలో సహాయక బృందాలకు రోజురోజుకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి.

సఫారీ వాహనంలో సిస్మాలజీ బృందం..

భూ ప్రకంపనలు, భూమిలో ప్రయాణించే ప్రత్యాస్తి తరంగాలను అధ్యయనం చేసే నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం నల్లమలలో సర్వే చేస్తున్నారు. రెండు ప్రత్యేక సఫారీ వాహనాలను అటవీశాఖ అధికారులు కేటాయించారు. సొరంగంలో ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి అధికారులు సిస్మాలజీ ప్రతినిధులకు లాంగిట్యూడ్, ల్యాటిట్యూడ్ లొకేషన్‌ను పంపిస్తుండగా సర్వే చేపడుతున్నారు. సమగ్ర నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిసింది.

సక్రమంగా పనిచేయని కన్వేయర్ బెల్ట్..

సొరంగంలో సింగరేణి కార్మికుల పనికి ప్రాధాన్యం ఉండటంతో అధికంగా తరలివస్తున్నారు. కాగా టీబీఎం వద్ద 7 కంటైనర్లు ఉండగా.. ఒక కంటైనర్ మాత్రం బయట పడిందని, మిగిలినవన్నీ మట్టితో కూరుకుపోయినట్లు సమాచారం. బయటపడ్డ కంటైనర్‌లో ఆక్సిజన్ సౌకర్యం ఉందని.. అందులో చిక్కుకున్న కార్మికులు ఉండి ఉంటే క్షేమంగా బయటపడే వారని సహాయక బృందాలు చెబుతున్నాయి. టీబీఎం విడిభాగాలను తొలగించడానికే అధిక సమయం పడుతుందని.. సరైన విద్యుత్ సౌకర్యం లేక కన్వేయర్ బెల్ట్ సక్రమంగా పని చేయకపోవడంతో మట్టి తరలింపునకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. సొరంగంలో కార్మికులు సుమారు ఆరు నుంచి 10 గంటలు పని చేస్తుండగా.. మొబైల్ టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.


సొరంగంలోని పరిస్థితిని మొబైల్‌లో పరిశీలిస్తున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరవింద్‌కుమార్

సహాయక చర్యలు ఇలా..

- చిక్కుకున్న కార్మికులను గుర్తించేందుకు కడావర్ డాగ్స్ బృందం శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఎస్ఎల్‌బీసీ సొరంగంలోకి వెళ్లింది.
- 15 ఫీట్ల లోపలున్న వారిని గుర్తించగలగటం ఈ శునకాల ప్రత్యేకత.
- సొరంగంలోని బురద, మట్టి, ఇతర శిథిలాలను తొలగించేందుకు 110 మంది ఎన్‌డీఆర్ఎఫ్, ఇతర బృందాలు లోకో ట్రైన్‌లో వెళ్లారు.
- నలుగురు సభ్యుల అన్వి రోబోటిక్ నిపుణుల బృందం, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు ఉదయం 11.25కు మరోమారు సొరంగంలోకి వెళ్లారు.
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భరోసా కేంద్రం నుంచి ఆరుగురు బాధితులకు శుక్రవారం ఎస్పీ డి.జానకి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. భరోసా కేంద్రం ఎస్ఐ సుజాత పాల్గొన్నారు.

- హోంగార్డ్స్ సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయంలో భాగంగా ఐదుగురు హోంగార్డ్స్‌కు ఎస్పీ జానకి చెక్కులు అందజేశారు. కవితకు రూ.15,000, శేఖరయ్య, వెంకట్రాములు, నాగమణి, శోభకు రూ.10 వేల చొప్పున చెక్కులు అందించారు.

మహిళా శక్తిని సమాజానికి చాటి చెప్పాలి

పాలమూరు: మహిళలు ఎందులో తక్కువ కాదని, మహిళా శక్తిని సమాజానికి చాటి చెప్పాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళను గౌరవించే సంస్కృతి మన ఇంటి నుంచే మొదలుపెట్టాలన్నారు. స్త్రీ శక్తిని దేనితో పోల్చలేమని, వారి పట్ల గౌరవంగా ఉండాలని సూచించారు. న్యాయమూర్తులు కళ్యాణ్ చక్రవర్తి, శారదా దేవి, శ్రీదేవి, రాజేశ్వరి, డి.ఇందిర, రాధిక, మమతారెడ్డి, రవిశంకర్, భావన, నిర్మల, మాధవి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.


కేకు కట్ చేస్తున్న మహిళా న్యాయమూర్తులు

సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ ఏబీసీ ముసాయిదాను సీఎం రేవంత్‌రెడ్డి , మంత్రివర్గం ఆమోదించి చట్టం చేయడానికి నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేత ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృపాకర్ అన్నారు. శుక్రవారం టీఎన్జీఓ భవనం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వినోద్‌కుమార్, సింగిరెడ్డి పరమేశ్వర్, రాయికంటి రాందాస్, మీసాల రాము పాల్గొన్నారు.

రవాణాశాఖ మంత్రికి కృతజ్ఞతలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులకు రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా ఒక గంట ముందు ఇంటికెళ్లే వెసులుబాటును అమలు చేయాల్సిందిగా ఆల్‌మేవా ఆధ్వర్యంలో ఇటీవలే రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, ఎండీలకు వినతిపత్రాలు పంపించినట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఫారుఖ్ హుస్సేన్, సయ్యద్ వహీద్‌షా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్య సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మత్స్య సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలని మహబూబ్‌నగర్ జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ కోరారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతి పత్రం సమర్పించారు.

అతివకు అందలం

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలంటే చదువు ఎంతో ముఖ్యం

- కుటుంబ పోషణతో పాటు ఉద్యోగాల్లోనూ రాణించడం ఆమెకే సాధ్యం
- ప్రభుత్వం మరిన్ని చట్టాలు, స్కీంలు తీసుకువస్తే మహిళా సాధికారత
- ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారతపై 'సాక్షి' డిబేట్



సాక్షి డిబేట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఆధునిక ప్రపంచంలో సమాజం ఎంతో అభివృద్ధి చెందినా మహిళలు తక్కువ, మగవారు ఎక్కువ అనే భావన తొలగిపోవడం లేదు. మహిళా సాధికారత, సమానత్వం సాధించాలంటే ప్రతి మహిళ కూడా ఉన్నత విద్యను అభ్యసించి.. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తమదైన ముద్ర వేసినప్పుడే అన్నీ సాధ్యమవుతాయని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన డిబేట్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో డిగ్రీ, పీజీ విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొని తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

ఉన్నత విద్యతోనే..



మహిళా సాధికారత సాధించి, సమానత్వం రావాలంటే తప్పకుండా ఉన్నత విద్యను అభ్యసించి, మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందినప్పుడు మాత్రమే సాధ్యపడుతుంది. అందుకే పాఠశాల, కళాశాలలో చదువుతున్న క్రమంలో ప్రతి విద్యార్థిని కూడా అనవసర విషయాల జోలికి పోకుండా చదువులపై దృష్టి సారించినప్పుడు అవకాశాలు వాటంతట అవే వస్తాయి.

– భవాని, బీకాం, ఫస్ట్ ఇయర్

ఉద్యోగావకాశాలు కల్పించాలి..



మహిళా సాధికారత రావాలంటే ప్రతి ఒక్కరు తప్పకుండా ఏదో ఒక ఉద్యోగం చేసే విధంగా అవకాశాలు రావాలి. చదువులు ఉన్నప్పటికీ కొంత మంది ఉద్యోగాలు చేయలేని పరిస్థితి ఉంది. అందుకు ప్రభుత్వం మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్ అందిస్తే సులువుగా ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంది.

– నిహారిక, బీకాం, ఫస్ట్ ఇయర్

మహిళగా గర్విస్తున్నా..



సమాజంలో మహిళలు ఉద్యోగం చేసేవారు ఇటు కుటుంబాన్ని.. అటు ఉద్యోగం రెండింటినీ సమన్వయం చేసే శక్తి ఒక్క మహిళకు మాత్రమే ఉంది. అంత ఓర్పు మహిళలకు ఉన్నందుకు ఒక మహిళగా గర్విస్తున్నా. మహిళ కేవలం వంటింటికే పరిమితం కాకుండా ప్రస్తుతం అనేక రంగాల్లో రాణిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆర్థిక సమానత్వం సాధిస్తే సాధికారత సాధ్యపడుతుంది.

– వసంత, ఎంజెడ్‌బీటీ, సెకండ్ ఇయర్

చైతన్యం అవసరం..



చాలామంది మహిళలు అవగాహన లేకకపోవడం, హక్కులు తెలియపోవడం వంటి విషయాల కారణం సాధికారత సాధ్యపడడం లేదు. అందుకోసం సామాజిక అంశాల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి మహిళలో కూడా చైతన్యం వచ్చి రాజకీయ, సామాజిక, ఉద్యోగాల్లో వారి సంఖ్య పెరిగితే అప్పుడు మహిళలు పురుషులతో సమానంగా రాణించగలుగుతారు.

– నీలిమ, బీబీఏ, సెకండ్ ఇయర్

కుటుంబమే బలం..



పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయి వరకు బాలికలు చదువుతున్నప్పటికీ ఉన్నత విద్యకు వచ్చే సరికి వారి సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉంది. వీటితో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, మరిన్ని యూనివర్సిటీలను అందుబాటులోకి తీసుకువస్తే మహిళలు చదువుకునేందుకు ఆస్కారం ఉంది. నాకు అన్ని స్థాయిల్లో కుటుంబ సభ్యులు సహకరించడం వల్ల ప్రిన్సిపాల్ స్థాయి వచ్చా. మహిళలకు కుటుంబమే బలం. అలాంటి అవగాహన అందరిలో రావాలి.

– పద్మావతి, ప్రిన్సిపాల్, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల

తోటివారికి సహకరించాలి..



సమాజంలో మహిళలకు తోటి వారే సహకరించాలి. పని చేసే ప్రదేశం, ఇతర చోట్ల ఎక్కడైనా మహిళలు ఒకరికి ఒకరు సహరించుకుంటే ముందుకు సాగేందుకు ఆస్కారం ఉంటుంది. రెండు కొప్పులు ఒక దగ్గర కలవవు అనే నానుడి నుంచి బయటికి రావాలి. ప్రతి మహిళా సాధికారత సాధించాలంటే తప్పకుండా విద్యను ఒక ఆయుధంగా మలచుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.

– సుభాషిణి, ఎంవీఎస్ కళాశాల అధ్యాపకురాలు

అవగాహన అవసరం..



సమాజం ఎంత అభివృద్ధి చెందినా చాలా మంది మహిళలకు బయటి ప్రపంచం గురించి తెలియని పరిస్థితి. అందుకే వంటిళ్లు కుటుంబమే జీవితంగా జీవిస్తున్నారు. అందుకోసం ప్రతి మహిళ తమ హక్కులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అగ్రశ్రేణి సంస్థల్లో మహిళలు ఉన్నత పదవుల్లో ఉన్నారు. కానీ, చాలా మంది అవగాహన లేనందుకు ప్రతి విషయానికి పురుషులపై ఆధారపడాల్సి వస్తోంది.

– తనీష, ఎంపీసీ, ఫస్ట్ ఇయర్

కట్టుబాట్లు ప్రతిబంధకాలు..



మన సమాజంలో మహిళలు సాధికారత సాధించకపోవడానికి కట్టుబాట్లు, పద్ధతులు ఒక ప్రతిబంధకంగా మారాయి. ఉన్న ఒక్క జీవితానికి ప్రతి మహిళ తన లక్ష్యాన్ని, తన కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేయాలి. చరిత్రలో ఎంతో మంది మహిళలు దేశ అస్తిత్వం కోసం పోరాటం చేశారు.. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని.. కొత్త చరిత్ర సృష్టించాలి.

– వాహిని, ఎంపీసీఎస్, సెకండ్ ఇయర్

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం



ఎంత కష్టాన్ని అయిన భరించేతత్వం ఒక్క మహిళకే ఉంటుంది. నేనూ ఒక మహిళ అయినందుకు గర్విస్తున్నా. నాకు అన్ని విషయాల్లో సహకరించే కుటుంబ సభ్యులు, మా తల్లి దండ్రుల సహకారం మరువలేనిది. మహిళ సాధికారత, సమానత్వం సాధించాలంటే తప్పకుండా కుటుంబ సభ్యుల సహకారం ఉంటే ఏదైనా సాధ్యమే. ప్రభుత్వాలు, మరిన్ని చట్టాలు, స్కీంలు తీసుకురావాలి.

– ఆలియా, ఎంజెడ్‌సీ, సెకండ్ ఇయర్

రోడ్డు ప్రమాదంలో సీడీసీ చైర్మన్ దుర్మరణం


చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

కొత్తకోట: పట్టణానికి చెందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చెరుకు అభివృద్ధి మండలి అధ్యక్షుడు, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు పాపయ్యగారి చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ గొల్లబాబు (55) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై ఎల్బీనగర్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన గతేడాది అక్టోబర్ 27న ఉమ్మడి జిల్లా సీడీసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి మరణంతో పట్టణంలో విషాదచాయలు అలుముకున్నాయి. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆమె కోసం.. ఒకరోజు

అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం 2023, మార్చి 8న మహిళా క్లినిక్‌లను ప్రారంభించింది. జిల్లాలోని జనరల్ ఆస్పత్రులు, 24 గంటలు సేవలందించే పీహెచ్‌సీల్లో మహిళా క్లినిక్‌లు కొనసాగుతున్నాయి. ఈ క్లినిక్‌లలో ప్రతి మంగళవారం మహిళలకు వైద్యసేవలు అందిస్తారు. ప్రతి వారం ఒక రకమైన వైద్య సేవలు అందిస్తున్నారు. సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తుండగా.. బుధవారం, శనివారం టీకాలు, శుక్రవారం డ్రై డే, గురువారం హెల్త్‌కేర్ క్లినిక్ వృద్ధుల కోసం చేస్తుండగా.. ఖాళీగా ఉన్న మంగళవారాన్ని మహిళలకు కేటాయించారు. ఇందులో 57 రకాల వైద్య పరీక్షలు చేయనున్నారు. ఈ క్లినిక్స్‌లో పరీక్షలు చేసి 24 గంటల్లో రిపోర్టు అందజేస్తారు. ఈ మేరకు తెలంగాణ డయాగ్నోస్టిక్ పోర్టల్ ప్రత్యేక లింక్ రూపొందించింది. నమూనాల సేకరణ, కేంద్రాలకు తరలింపునకు వాహనాలు, స్టాఫ్‌ను నియమించారు.

పాలమూరు నుంచి 14 బస్సులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హైదరాబాద్‌లో శనివారం జరిగే మహిళా దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జీలు 800 మంది పాల్గొనాలని మెప్మా ఇన్‌చార్జ్ డీఎంసీ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌కి చెందిన 700 మంది మహిళల కోసం 14 ఆర్టీసీ బస్సులను ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో అందుబాటులో ఉంచినట్లు ఆమె పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల కల్లా ఆయా ప్రాంతాలకు తరలి రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

బ్యాంకులో ఖాళీలను భర్తీ చేయాలి

- ఎస్‌బీఐ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బ్యాంకులో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌బీఐ అవార్డు స్టాఫ్ యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, రీజినల్ కార్యదర్శి నరేష్ కుమార్, ఆఫీసర్ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి జగన్నాథ్‌రెడ్డి అన్నారు. తమ విధులు ముగించుకొని పట్టణంలో వివిధ ఎస్‌బీఐ బ్రాంచీల ఉద్యోగులు జిల్లా కేంద్రం మెట్టుగడ్డలోని ఎస్‌బీఐ ఎదుట శుక్రవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. ధర్నాలో బ్రాంచీల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.